క్లుప్తంగా

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి దామోదరను సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొల్లారం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ చంద్రారెడ్డి, బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

గణేష్‌గడ్డ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా లావణ్య



సన్మానం పొందిన మోహన్‌రెడ్డి, లావణ్య

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ ఆలయ ఈవో మోహన్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో జూబ్లీ హిల్స్ శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో లావణ్య గణేష్‌గడ్డ ఆలయ ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్,ఆలయ అర్చకులు పదవీ విరమణ పొందిన ఆలయ ఈవో మోహన్‌రెడ్డితో పాటు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి లావణ్యను ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్, సతీష్, అయ్యప్ప, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈవోకు అర్చకుల సన్మానం

నారాయణఖేడ్: ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న మోహన్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. మనూరు మండల పరిధిలోని బోరంచ నల్లపోచమ్మ ఆలయం ఈవోగా కూడా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన మోహన్‌రెడ్డిని ఆలయ అర్చకులు శ్రీకాంత్‌స్వామి, నగేష్ స్వామి, సిద్ధుస్వామి సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వ్యక్తి అదృశ్యం



పటాన్‌చెరు టౌన్: పెయింటింగ్ పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీకి చెందిన బాలాజీ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం రోజు మాదిరిగానే పెయింటింగ్ పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బాలాజీ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి అదృశ్యంపై కుమారుడు విజయ్‌కుమార్ గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

నారాయణఖేడ్: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. పలు వార్డుల్లోని మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ప్రధాన చౌరస్తాల్లో బ్లీచింగ్ పౌడరు చల్లారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పనులను పర్యవేక్షించారు.

విత్తన నమూనాల సేకరణ

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని చిమ్నాపూర్ గ్రామంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ పత్తి విత్తన నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కంపెనీల పత్తి విత్తన ప్యాకెట్లను ల్యాబ్‌లకు తరలించి విత్తనాల నాణ్యతను పరీక్షిస్తామని ఏఓ వివరించారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నిక

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ శివారులోని సిద్ధివినాయక ఆలయంలో మండల బ్రాహ్మణ సేవా సంఘం కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా సతీష్‌కుమార్ కుల్‌కర్ణి, ఉపాధ్యక్షుడిగా ప్రకాష్ జోషి, నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా మోహన్ జోషి, కార్యనిర్వహణ కార్యదర్శులుగా వినోద్ జోషి, వెంకట్ జోషి, ప్రచార కార్యదర్శిగా అభిషేక్ జోషి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజ్‌కుమార్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

నష్టాల నుంచి లాభాల దిశగా..

సిర్గాపూర్ మండల పరిధిలోని బోక్కస్‌గాం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నష్టాల నుంచి లాభాల దిశగా పయనిస్తోంది. డీసీసీబీ పరిధిలో ఉన్న సొసైటీ సంగారెడ్డి జిల్లాలో ఆదర్శంగా గుర్తింపు పొందింది. పీఏసీఎస్ పరిధిలోని ఆయా గ్రామాల్లో వరి, జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు భరోసాగా నిలుస్తోంది. పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాంలు చొరవతో పీఏసీఎస్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది.

– కల్హేర్(నారాయణఖేడ్)

- అభివృద్ధి పథంలో పీఏసీఎస్ బోక్కస్‌గాం
- జిల్లాలో ఆదర్శ సొసైటీగా గుర్తింపు
- రూ.40లక్షలతో గోదాం నిర్మాణం
- ధాన్యం కొనుగోలుతో రైతులకు భరోసా
- మద్దతు ధర కల్పించడంలో పీఏసీఎస్ ముందంజ



బోక్కస్‌గాంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

పీఏసీఎస్ పరిధిలో బోక్కస్‌గాంతో పాటు అంతర్‌గాం, సుల్తానాబాద్, చిన్న ముబారక్‌పూర్, పెద్ద ముబారక్‌పూర్, గరిడెగాం గ్రామాలు ఉన్నాయి. 1380 మంది సొసైటీలో సభ్యులు ఉన్నారు. ఐదేళ్ల క్రితం రూ.1.50 కోట్లు నష్టాల్లో ఉన్న పీఏసీఎస్ ప్రస్తుతం రూ.కోటికి పైగా లాభాల్లో నడుస్తోంది. పీఏసీఎస్ ద్వారా ఇప్పటివరకు రూ.10.50 కోట్లు పంట రుణాలు, రూ.3.50 కోట్లు ఎల్‌టీ రుణాలు అందజేశారు. సభ్యత్వ రుసుం కింద రూ.కోటి వరకు ఉన్నాయి. పంట రుణాలు సకాలంలో చెల్లించడంలో పీఏసీఎస్ సిబ్బంది రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు.

చివరి దశకు గోదాం నిర్మాణ పనులు

రైతుల అవసరం నిమిత్తం ధాన్యం నిల్వ ఉంచేందుకు పీఏసీఎస్ 10శాతం వాటా కింద రూ.40లక్షలతో అంతర్‌గాంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణ పనులను చేపట్టారు. ప్రస్తుత సీజన్‌లో 35 వేల క్వింటాళ్ల జొన్నలు, 20వేల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశారు. ప్రతి ఏటా వరి ధాన్యం, జొన్నలు, మొక్కజొన్నలు, శనగలు, సోయలు కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పించడంలో సొసైటీ ముందుంటోంది. పీఏసీఎస్ పరిధిలో బోక్కస్‌గాంతో పాటు అంతర్‌గాం, సుల్తానాబాద్, చిన్న ముబారక్‌పూర్, పెద్ద ముబారక్‌పూర్, గరిడెగాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సొసైటీకి ఆదాయం వస్తోంది. సిర్గాపూర్ మండల కేంద్రంలో వినియోగదారుల సేవా కేంద్రం (సీఎస్‌సీ) ఏర్పాటు చేశారు.

ఉత్తమ అవార్డు కోసం ఎంపిక

ఇటీవల అడిషనల్ కలెక్టర్ మాధురి బోక్కస్‌గాం సొసైటీని సందర్శించారు. పీఏసీఎస్ నిర్వహణ, రైతులకు అందుతున్న సేవల గురించి చైర్మన్ గుండు వెంకట్‌రాంలు, సీఈఓ సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆదర్శంగా నిలిచిన బోక్కస్‌గాం సొసైటీకి రాబోయే తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఉత్తమ అవార్డులు అందజేస్తామని అడిషనల్ కలెక్టర్ తెలిపారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



పీఏసీఎస్ ద్వారా రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి అందుతున్న రుణాలు అందజేయడంతో పాటు మద్దతు ధరను కల్పిస్తూ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నాం. రైతులకు ఎప్పటికప్పుడు సీఈఓ, సిబ్బంది సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఉన్నతాధికారుల సహకారంతో జిల్లాలో పీఏసీఎస్‌కు మంచి గుర్తింపు వచ్చింది.

– గుండు వెంకట్‌రాంలు, డీసీసీబీ డైరెక్టర్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- ఎస్ఐ సుభాష్



సమావేశంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

హత్నూర(సంగారెడ్డి): నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హత్నూర ఎస్ఐ సుభాష్ అన్నారు. మండల పరిధిలోని దౌల్తాబాద్ రైతువేదికలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ సుభాష్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు అందరూ తమ దుకాణాల్లో ధరల పట్టిక, స్టాక్ నిల్వ పట్టిక, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన పుస్తకాలను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. ఎరువులను ఆధార్ కార్డు ఆధారంగా నడిచే ఈ పాస్ మెషీన్ ద్వారానే అమ్మకాలు జరపాలని పేర్కొన్నారు. రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నిల్వ ఉండేలా చూసుకోవాలని, రైతులకు తప్పనిసరిగా రశీదులను ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని డీలర్లపై సెక్షన్ ఐపీసీ 420, సెక్షన్ 15 క్లాస్ 1 ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ యాక్ట్, సెక్షన్ 7 ఆఫ్ ఎసన్షల్ యాక్ట్, ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రేమ్‌రాజ్, వరప్రతాప్ పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం



గుమ్మడిదలలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(బి), న్యాల్‌కల్ పీహెచ్‌సీల్లో శుక్రవారం ప్రపంచ పొగాకు నిరోధన దినోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఆయా పీహెచ్‌సీల వద్ద వైద్య సిబ్బంది పొగాకు ఉత్పత్తుల వాడకంపై కలిగే నష్టాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శించారప్లీ సందర్భంగా పొగాకు ఉత్పత్తులను వాడకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): టొబాకో వాడటంపై కలిగే దుష్పరిణామాలపై గుమ్మడిదలలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు టొబాకో వాడటం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. అదే విధంగా వీరన్నగూడెంలో ఆశావర్కర్లు సిగరెట్లు వాడటం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ ముమ్మరం



జోగిపేటలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

జోగిపేట(అందోల్): జోగిపేటలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి విజయరత్న, ఎస్ఐ అరుణ్‌కుమార్, తహసీల్దార్ భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విత్తనాలకు సంబంధించి ప్యాకెట్‌లపై ఎక్స్‌పైరీ తేదీలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

కల్హేర్(నారాయణఖేడ్): నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని మండల టాస్క్‌ఫోర్స్ టీం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకటేశం హెచ్చరించారు. కల్హేర్‌లో ఎరువుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎవరైన నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్, సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

లైసెన్సులు రద్దు చేస్తాం

వట్‌పల్లి(అందోల్): నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్ల లైసెన్సులను రద్దు చేస్తామని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ అన్నారు. వట్‌పల్లి, బిజిలీపూర్, మర్వెల్లి గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మహేష్‌చౌహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల తనిఖీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రాంతీర్థ్, గంగ్వార్, న్యాల్‌కల్, ముంగి తదితర గ్రామాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాలను శుక్రవారం ఉదయం అధికారులు తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తదితరులు దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని వారు విక్రయ దారులకు సూచించారు.

మట్టి అక్రమ తరలింపుపై చర్యలేవి?

- అధికారులను నిలదీసిన సభ్యులు
- రుణాల చెల్లింపులపై రైతులను వేధించడం తగదు
- ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ ఎంపీటీసీల అసహనం



అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న గడ్డపోతారం గ్రామస్తులు, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదని, కాలుష్య సమస్యను పరిష్కరించటంలో పీసీబీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సభ్యులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు నివేదికలను సభకు వివరించారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు మాట్లాడుతూ ఉచిత కరెంటు సక్రమంగా సరఫరా చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటివరకు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు రుణాల చెల్లింపులకు కోసం రైతులను వేధిస్తుండటం బాధాకరమన్నారు. జల, వాయు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నా పీసీబీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. దీంతో స్పందించిన పీసీబీ అధికారి రవీందర్ మాట్లాడుతూ కాలుష్యాన్ని వదులుతున్న పరిశ్రమల యజమాన్యాలకు నోటీసులు అందజేస్తున్నామని సభకు వివరించారు. 2019లోనే మంగంపేట గ్రామంలో డంప్‌యార్డును నిర్మించామని, అయితే పరిశ్రమలకు కేటాయించిన ఈ స్థలంలో డంపుయార్డు ఉండటంతో సంబంధిత పరిశ్రమ యాజమాన్యం డంప్‌యార్డును కూల్చివేసిందని, దీంతో ఇబ్బందులు తప్పడంలేదని ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా ఈ విషయంపై కలెక్టర్‌కు త్వరంలోనే నివేదిస్తామని అధికారులు తెలిపారు. అల్లీనగర్‌లోని భామని కుంట నుంచి టిప్పర్‌ల ద్వారా ప్రైవేట్ వెంచర్లకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నా ఇరిగేషన్‌శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సభ్యులు జానాబాయి మండిపడ్డారు. రాళ్లకత్వ శివారులోని కంకర క్రషర్‌లకు కేటాయించిన ప్రభుత్వ భూముల నుంచి అక్రమార్కులు మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని సభ్యులు వాగ్వాదానికి దిగారు. జిన్నారంలోని సర్వేనంబర్ 1లో రైతుల భూములను పరిశ్రమలకు కేటాయించారని, తమకు కేటాయించాల్సిన స్థలాన్ని ఇచ్చి పంటను సాగు చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. అనంతరం గడ్డపోతారం గ్రామ పంచాయతీ నుంచి కిష్టాయిపల్లిని వేరు చేసి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీఓ సంతోష్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఏఓ అభినాష్‌వర్మ

రాయికోడ్(అందోల్): రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు సభ్యులు అధికారులకు సూచించారు. ఎంపీపీ మొగులప్ప అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మాట్లాడుతూ రాయికోడ్‌లోని జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం విక్రయించడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, నాణ్యత పేరిట విక్రయానికి తీసుకువచ్చిన జొన్నలను అక్కడి సిబ్బంది తిరిగి పంపుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఏఓ అభినాష్‌వర్మ దృష్టికి తీసుకువచ్చారు. ఇటికేపల్లిలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని సభకు వివరించారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మొగులప్ప హామీనిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మమత, ఎంపీడీఓ షషి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

జహీరాబాద్ టౌన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శేషురావు వైద్య సిబ్బందితో కలిసి కార్మిక కుటుంబాలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల హక్కులను కాపాడుతూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తోందన్నారు. కార్మికులకు వైద్య, విద్యాపరంగా సీఐటీయూ సహాయ కార్యదర్శి మహిపాల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని బెల్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన గడీల నగేష్‌ను కార్మికులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు బూరగడ్డ నగేష్, పలువురు కార్మికులు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు గడీల నాగేష్ చేసిన సేవలను కొనియాడారు.

◆ రేపు ఖోఖో అసోసియేషన్ సమావేశం

సంగారెడ్డి: మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు జనరల్ సెక్రటరీ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ అధ్యక్షతన టీఎంజీఓ భవన్‌లో ఉదయం 10.30 నిమిషాలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలన

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ముబారక్ పూర్(ఏ) ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా చేపట్టిన పనులను ఎంఈవో దండు అంజయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువులోపు పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిష్టయ్య, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

◆ పరామర్శ

నారాయణఖేడ్: మండల పరిధిలోని పలుగు తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు నేనావత్ టోప్యానాయక్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీబాయితో కలిసి టోప్యానాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

◆ ఇంటింటికీ డీసీసీబీ కార్యక్రమం


నారాయణఖేడ్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీ బ్యాంకు)లో ఇంటింటికీ డీసీసీ బ్యాంకు అనే కార్యక్రమాన్ని జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని నారాయణఖేడ్ డీసీసీబీ బ్రాంచి మేనేజరు వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలలో తమ శాఖలో సహకార బచన్ డిపాజిట్‌తో పాటు ఉచిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

◆ లోక కల్యాణార్థం పాదయాత్ర

జహీరాబాద్ టౌన్: లోక కల్యాణార్థం బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు ద్వాదశ జ్యోతిర్లింగాల పాదయాత్ర ప్రారంభించాడు. శుక్రవారం యువకుడి జహీరాబాద్ పట్టణానికి చేరుకున్నాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజ్‌కుమార్ మహంత్ వృత్తిరీత్యా కరాటే మాస్టర్.. అయితే లోక కల్యాణార్థం పాదయాత్ర ద్వారా ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం చేసుకోవాలని జనవరి 6న పాదయాత్ర ప్రారంభించి ఇప్పటివరకు 10 జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. ఏపీ రాష్ట్రంలోని శ్రీశైలానికి వెళ్తూ జహీరాబాద్ పట్టణానికి వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాదయాత్ర చేపట్టినట్లు తెలిపాడు.

గుర్తింపులేని పాఠశాలలను రద్దు చేయండి

నారాయణఖేడ్: ప్రభుత్వం నుంచి అనుమతి పొందకుండా కొనసాగిస్తున్న పాఠశాలలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నారాయణఖేడ్‌లోని పల్లవి పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో పల్లవి పాఠశాల యాజమాన్యం సీబీఎస్‌సీ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తోందన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కొనసాగిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, చంద్రశేఖర్, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పల్లవి పాఠశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బడిబాటను విజయవంతం చేయండి

- ఎంఈఓ మారుతి రాథోడ్



మాట్లాడుతున్న ఎంఈఓ రాథోడ్



మాట్లాడుతున్న ఎస్ఐ రామానాయుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ మారుతి రాథోడ్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు అన్నారు. బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎంపీపీ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడీడు కలిగిన పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

వట్‌పల్లి(అందోల్): జూన్ 3 నుంచి 19 వరకు నిర్వహించనున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శశిప్రభ, ఎంఈఓ కృష్ణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లకు, పంచాయితీ కార్యదర్శిలకు అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బందికి బడిబాటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించి ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమమన్న నమ్మకాన్ని తల్లిదండ్రుల్లో కలిగించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు జూన్ 3లోపు పూర్తయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

పటాన్‌చెరు టౌన్: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో పీపీ రాథోడ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బడీడు పిల్లలను, బాల కార్మికులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వీరేశం పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, ఎస్ఐ, సీడీపీఓ చంద్రకళ, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.